సాంధ్యవేళ

(గేయ సంహిత)

పింగళి పాండురంగరావు

ప్రచురణ :

సాహితీ మంజరి

ఒంగోలు.

* 'సాంధ్యవేళ'
(కవితలు)

* ప్రథమ ముద్రణ :
డిశంబరు 1985

* వెల :
రు. 10/-

* ముద్రణ :
విజయ ప్రింటర్స్,
ఒంగోలు.

* ప్రతులకు :
కుమారి పింగళి మాధవీలత,
'సాహితీ మంజరి'
బి. 11, సి. ఆర్. పి. క్వార్టర్స్
ఒంగోలు - 523 001

భగవాన్!

“భగవాన్! నాదేశం మట్టి, నీరు, గాలీ
ఫలాలూ — తేనెలూరనీ!

ఇళ్ళూ, వాకిళ్ళూ, అడవులు, పొలాలూ
సిరులు తూగనీ!

మాటలూ, చేతలూ, ఆశలూ, బాసలూ
నిజాలతో నిండనీ!

నా దేశ జనుల హృదయాలు
ఒక్కటై వెలగనీ!

వారందరి బతుకులు
ఒక్కటై పండనీ!

—విశ్వకవి టాగోర్



సాహితీ మంజరి

ఒంగోలు.

వ్యవస్థాపకులు : కుమారి పింగళి మాధవీలత

కార్యనిర్వాహకాధ్యక్షులు : పింగళి పాండురంగరావు

ప్రచురణలు :

1. నీరాజనం (గేయసంపుటి)
   —పింగళి పాండురంగరావు
2. మహాభినిష్క్రమణం (ఇందిరాగాంధీ సంస్మరణ కవితా సంపుటి)
   కూర్పు : పింగళి పాండురంగరావు
3. స్మృతిసుధ (కవితా సంపుటి)
   —పింగళి పాండురంగరావు
4. బైరాగి కవితాశోభ (సమీక్షా వ్యాసాలు)
   సంపాదకులు : పింగళి పాండురంగరావు
5. నిష్కృతి (కవితలు)
   —పింగళి పాండురంగరావు
6. శరసంధానం (కవితలు) —పైడిశ్రీ
7. గోరుముద్దలు (బాలవిజ్ఞాన కవితలు)
   —రావెల సాంబశివరావు
8. సాంధ్యవేళ (కవితా సంపుటి)
   —పింగళి పాండురంగరావు

కృతజ్ఞతలు

ఈ "సాంధ్యవేళ" గేయ కావ్యాన్ని సహృదయ పాఠక లోకం ముందుంచడానికి సంతోషిస్తున్నాను.

ఇందులోని కవితలలో కొన్ని ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, మయూరి మున్నగు దినవార పత్రికలో ప్రచురితమైనవే. ఈ సందర్భంలో, ఆయా పత్రికాధిపతులకు, వారిచ్చిన ప్రోత్సాహాన్ని బట్టి- కృతజ్ఞణ్ణి.... ప్రత్యేకించి పూజ్యులు శ్రీ నండూరి రామమోహన రావుగార్కి, శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగార్కి, శ్రీ ఎల్లోరాగార్కి, శ్రీ శివలెంక రాధాకృష్ణగార్కి, శ్రీ సుగమ్ బాబుగార్కి నా హృదయ పూర్వక వందనాలు.

కవితా రంగంలో నిలబడ్డానికి ధైర్యం చాలకున్న నా భుజం తట్టిన మాన్యులు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యంగారు, డా॥ సంజీవ దేవ్‌గారు, డా॥ చల్లా రాధాకృష్ణశర్మగారు– తమ కార్యభావాన్ని ఓ పక్కనపెట్టి, నా కవితా కన్నియ రూపురేఖల్ని చిత్రిస్తూ తమ అమూల్యాభిప్రాయాల్ని అందించారు.... ఈ అగ్రజులకు నేను ఎంతైనా ఋణపడివున్నాను. ఇదే నా కృతజ్ఞతాంజలి.

పుస్తకాన్ని అందంగా ముద్రించిన విజయ ప్రింటర్స్ (ఒంగోలు) అధినేత శ్రీ నన్నూరి సుబ్బారావుగారికి నా అభివందనాలు.

–పింగళి పాండురంగరావు

పురాణం సుబ్రహ్మణ్యశర్మ,
ఎడిటర్,
ఆంధ్రజ్యోతి (వారపత్రిక)
విజయవాడ.

పాండురంగ మహాత్మ్యం

కవిత్వాన్ని తూచికొలిచే రాళ్ళులేవు నా దగ్గర అని చలంగారు "మహాప్రస్థానానికి" పీఠిక రాస్తూ అన్నారు. కవిత్వాన్ని అనుభవించి పలవరించాలని కాబోలు చెప్పారు కూడ.

ఆకాశం మీద మబ్బులు చెల్లాచెదురై కదులుతున్నట్లు నేలమీద నిలబడి తలెత్తిచూస్తే కనిపిస్తుంది. కొత్తగా ఎవరేనా రాసిన పద్యాలు నీలాల నింగిపై కదలాడే వెండి మబ్బుల్లాగ నాకగపిస్తాయి.

కవికి మంచి హృదయం వుండాలి. అది పాలకుండ. శివునికిలాగ తెరవగలిగిన మూడో కన్ను వుండాలి. తన కన్ను తీసి దేవునికిచ్చిన తిన్నడిలాగ కవి తన దృష్టిని లోకానికిచ్చి వాళ్ళకి తన హృదయాన్ని కూడ పంచి యిస్తాడు. అందుకే కవి లోకబాంధవుడు.

ఈ పింగళి పాండురంగరావుగారు యిప్పుడు "సాంధ్యవేళ" అనే కావ్యం రాశారు. నేను పైన చెప్పినవన్నీ అంతో ఇంతో వీరిలో ఉండకపోతే, వీరీ కావ్యం రాయరు. ప్రకృతి మీద, మనిషిమీద వీరికి ప్రగాఢమైన మక్కువ అదే 'సాంధ్యవేళ' కావ్యమై ప్రవహించిందని నేననుకుంటాను.

కవి తాను కవిగా లోకంలోకి ప్రవేశించడానికి చేసే ప్రయత్న దశలో రాసినవి కూడా యిందులో చేర్చినట్లు కనిపిస్తోంది. ఎవరి పాప వారికి కనుపాప. భావ కవుల మార్గంలో కొంతదూరం వెళ్ళాక అస్తమానం గాలిలో ఎగరడం దేనికని భూమార్గం పట్టి సామాజిక చైతన్యంతో రాయడానికి ప్రయత్నించినవి కూడా యిందులో వున్నాయి కవిత్వానికి ముందుమాట లెలాంటివంటే ఆపిల్ పండుని ఎర్రకాగితంలో చుట్టినట్లు–కవిత్వాన్ని డైరక్టుగా జనం మీదకి తోలకుండా కాస్త తెరచాటుగా చూపించడం అన్నమాట.

కవిత్వంలో రకరరాల సౌజ్ఞలని కవులు ప్రవేశ పెడుతుంటారు. అవి శక్తి దట్టించిన తూటాల్లా వుంటాయి. భావకవుల సింబల్స్ వేరు, అభ్యుదయ కవులవివేరు. యిలా భిన్నత్వం వుంటుంది.

పజ్యాలు వదలిపోయాయి కాబట్టి బతికిపోయాం అనుకునే కవులకు ఆధునిక కవిత్వం గురించి ఏమీ తెలియదనుకోవాలి. వచన కవిత్వం రాయడంకన్నా పజ్యాన్ని దట్టించడం తేలిక. అలాగే లిరికల్ పొయిట్రీనూ.

శ్రీ పింగళి పాండురంగరావుగారు యీ 'సాంధ్యవేళ'లో అన్ని వేపులకీ చూస్తూ, అన్ని పోకడలనూ నెమరు వేసుకుంటున్నారు.

"అక్షరార్చన" లో ఎఱ్ఱనగారి మీద చెప్పిన సుదీర్ఘ కవిత పాండురంగరావుగారి వేదనకు అక్షరసాక్ష్యంగా నిలుస్తుంది.

'నీ మల్లె పొదరిండ్ల మాటున
నీ ప్రబంధ శాంతివనాల నీడన
నన్ను కాస్త పరుండనీ' అంటూ
'నీ వాగ్ధారల వసంత వనవాటికలో
నే పరభృతమునై విహరించనీ' అని చెప్పారు.

ఈ కవి "సాంధ్యవేళ" చదివితే మనకు ఈ కవి గరళకంఠునిలా కూడా ప్రశ్నిస్తూ కనపడతాడు.

'ఈ సాంధ్యవేళల విందునా
నీ మధురగీతి?
రుధిరధారల వెలయునా
ముగ్ధరవళి?
వ్యధానౌకలు దాటునా ఈ శోకజలధి?

అని ప్రశ్నలువేస్తూ—

నీ మరుల పొదరిల్లు చేరునా
ఈ మౌక్తికమ్ము'

అని ఆశ్చర్యంగా అడుగుతారు.

కవికి ప్రశ్నలూ, ఆశ్చర్యార్థకాలే కదా చివరంటాకూడా వచ్చేది. ఆశ్చర్యార్థకాలు మెళ్ళోవేసుకుని ప్రశ్నల బొక్కాతొడుక్కొని బయల్దేరుతున్నాడు కవి పాండురంగరావుగారు. ఆదరించి ఆశీర్వదించండి- కవితా రసోల్లాసులై, కాళిదాసులై మీరు, మీరు, మీరూ!

డా॥ సంజీవ్ దేవ్, డి. లిట్.,
తుమ్మపూడి,
గుంటూరు జిల్లా.

ఒక వీక్షణ

మనిషికి కవిత అవసరమా? ఎందుకు అవసరం?

కవిత ఆకలి తీరుస్తుందా? తీర్చదు. కవిత ఆకలిని తీరిస్తే ఇంకా అన్నం ఎందుకు?

కవిత ఆకలిని తీర్చగలిగినట్లయితే, ఇక కవిత మిగిలి వుండేది కాదు. ఆకలైన వాళ్ళంతా కవితను తినేసేవాళ్ళు. కవిత ఆకలిని తీర్చేదిగా ఉండక పోవటం మేలయింది.

కవిత ఆకలిని తీరిస్తే ఇంకా కవితగా ఎందుకుండేది? కవిత అన్నంగా మారి ఉండేది.

సామాజిక శ్రేయం నిమిత్తం, కవిత కవితగానే ఉండిపోయింది కాని అన్నంగా మారలేదు!

కవిత ఆకలిని తీర్చని మాట నిజం, కాని.... ఆకలిని తీర్చే మార్గానికి తోడ్పడుతుంది, అదేవిధంగా ఆకలి తీర్చని మార్గానికీ తోడ్పడుతుంది.

ఆకలి తీర్చే కవిత గొప్పదని భావిస్తే ఆకలి తీర్చని కవిత తక్కువేమీ కాదు.

కవితాదర్శం ఆకలి తీర్చటం కాని, తీర్చకపోవటం కాని కాదు. ఆ కవితను రచించిన కవిని బట్టి తీర్చటానికీ, తీర్చకపోవడానికీ కూడ ఉపయోగ పడవచ్చు, పడకపోనూవచ్చు. అంతమాత్రాన కవి హీనుడు కాని, ఉత్తముడు కాని కాకపోవచ్చు.

ఆకలిరితీనా సుఖపడని వ్యక్తులకు కవిత ఆనందాన్ని కలిగిస్తుంది. తన రస సృష్టి ద్వారా! కవిత బాధితుల మానస కుటీరాల్లో మణిదీపాలను వెలిగిస్తుంది.

సామాజిక చైతన్యాన్ని సృష్టించలేనిది కవితేకాదని కొందరి వాదం. ఆ పని కవిలో వుంటే మాత్రం సృష్టించగలదా? కవిత అంటే ఒక కవిది మాత్రమేకాదు, పాఠకులది కూడ. అందువల్ల కవి ప్రయత్నానికి పాఠకులు కూడ చేయూతనివ్వాలి.

కవిత ఆకలి దప్పికలను తొలగిస్తుంది, మానసికంగా కొందరిలో. ఆకలి దప్పికలు శరీరానివి. అటువంటప్పుడు మానసికంగా ఎట్లా తొలగిస్తుంది? కొందరిలో శారీరకమైన ఆకలి తీరినా, మానసికమైన ఆకలి తీరకుండానే ఉండిపోతుంది.

కడుపులోని ఆకలి మనిషికి ఎంత బాధో మెదడులోని ఆకలి కూడ అంత బాధ. అన్నం కడుపులోని ఆకలిని తీరిస్తే కవిత మెదడులోని ఆకలిని తీరుస్తుంది.

శ్రీ పాండురంగరావుగారి "సాంధ్యవేళ" లో ఈ రెండు విధాలైన ఆకళ్లకు సంబంధించిన కవితలూ ఉన్నాయి.

దగాపడిన తమ్ముళ్లూ!
ఎన్నాళ్లోయీ! ఈ కన్నీళ్లు!
ఇంకెంత కాలం? ఈ దుర్భర దారిద్ర్యం
ఎపుడు తొలగేది! ఈ భయద
వ్యధా భరిత గాథాయవనికలు.
భయంకర క్షుధార్తి కీలల్లోంచి
మీ ఎర్రని రక్తాన్ని జుర్రుకున్న
దోపిడి గాంఢ్ర తుదిశ్వాసకు ప్రతీకగా
అవిర్భవించింది అభ్యుదయ సిద్ధాంతం.

అదేవిధంగా మరోదశలో కూడ ఈ కవితా ఝరి ప్రవహిస్తుంది. పైన చూపిన కవితలు పీడిత ప్రజల ఆర్తికి చెందివుంటే ఈ క్రిందివి ఆత్మాశ్రయ భావానుభూతికి చెందివుంటాయి. వీటిలో మర్మవాద (mysticism) నాదాలు ప్రతిధ్వనిస్తాయి.

ఈక్షయ సామ్రాజ్యాన్ని
సృజించిన వినోదప్రియా!
నాపై కృపను కుమ్మరించు
నా పాశవికతను సంహరించు
నా భక్తి హీనతను పరిహరించు
భక్తి భావజలధిలో
నా భవబంధాలన్నీ నిర్గమించేలా
ఈ విరహార్తి విశ్రమించేలా
నా అణువణువునూ స్పృశించు
నేకోరు అక్షయాన్ని ప్రసాదించు
కడవరకు నా కనులందే నివసించు!!

ఈ కవికవితల్లో మానవతావాదానికీ మర్మవాదానికీ రెంటికీ కూడ సమాన ప్రాధాన్యత ఇవ్వబడింది. మానవుడు అన్నం లేకుండానూ జీవించలేడు. అన్నంతో మాత్రమే జీవించలేడు – అనే సమన్వయాన్ని సూచిస్తాయి వీరి కవితలు.

జీవితంలోని స్థూలదశను, సూక్ష్మదశను, దేన్నికూడా నిర్లక్ష్య పరచలేదు ఈ కవి. మట్టిలోని సృష్టికి ఎంత విలువ ఇవ్వబడిందో మింటిలోని అనంతత్వానికి కూడ అంత విలువ ఇవ్వబడింది.

కవిత అంటే భావసౌందర్యం మాత్రమేకాదు. భాషా సౌందర్యం కూడ. "సాంధ్యవేళ"లో పదప్రయోగ ఔచితి, వాక్యాల కూర్పు, గతి శీలత మొదలైనవన్నీ నేర్పుతో రూపొందాయి.

"క్షయ సామ్రాజ్యం" ఏ స్రష్టచేత సృష్టించబడిందో తిరిగి ఆ స్రష్టచేతనే "అక్షయాన్ని" పొందాలనే తపన ఉచిత రీతిలో అభివ్యక్త మయింది పై కవితా పంక్తుల్లో,

నశ్వరం అనశ్వరంగా రూపాంతరంచెందాలనే ఆరాటం నశించే జగత్తులోని జీవులుదంరకూ సహజం. క్షయం, అక్షయం కావాలని అక్షరచనచేసే కవుల్లోనివారే శ్రీ పాండురంగరావుగారు. అయితే ఈ కవి భౌతిక జగత్తును, పీడిత ప్రజాకోటిని, స్థూలమైన అవసరాలను నిర్లక్ష్యపరచరు.

ఆత్మ నిమిత్తం ఈ కవి శరీరాన్ని త్యాగం చేయనట్లే శరీరం నిమిత్తం ఆత్మనుకూడ త్యాగం చేయరు. ఏ ఒక్కటి మాత్రమే పూర్ణం కాదు, రెంటి సమన్వయమే పూర్ణం. దేనికది అయితే శకలాలే. ఈ సత్యం ఈ కవితల్లో ప్రతిబంబించింది.

ఈ "సాంధ్యవేళ" లోవన్నీ వచన కవితలే. వీటిలో సంప్ర దాయబద్ధ చంధోనియములు ఉండనవసరం లేకపోయినా కూడ ఒక విధమైన రచనా శిల్పం, ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా

అయినా వుండాలి. అటువంటిది లోపిస్తే ఆ కవితలు "వచన కవితలు" కాక "వచన రచనలు" మాత్రమే అవుతాయి. అటువంటి ప్రమాదం ఈ పుస్తకంలో గోచరించదు.

"అచ్చటి
అ ఒక్క బింబానికి
ఇచ్చట
కోటానుకోట్ల ప్రతిబింబాలు
ఇక్కడి ప్రతి వస్తువుకేదో రూపం
ప్రతి రూపానికేదో నామం"

ఇటువంటి కమనీయ కవితా ఖండికలెన్నో ప్రత్యక్షమవుతాయి ఈ "సాంధ్యవేళ"లో

నేడు ప్రచురితమైవున్న ఆధునిక తెలుగు కవిత్వంలో ఎన్నో విధాలైన ఇంపులు, సొంపులు, రచనారీతుల్లో, వస్తురీతుల్లో రూపం తాలుస్తున్నాయి.

కొందరు ఆధునిక కవులు పీడిత ప్రజలను మాత్రమే తమ కవితా వస్తువుగా చేసికొంటే, మరికొందరు ఆత్మాశ్రయ అనుభూతులకు మాత్రమే కవితారూపాన్ని ప్రసాదిస్తూంటారు. శ్రీ పాండురంగరావు గారు రెంటినీకూడ కవితా వస్తువుగా స్వీకరించి ఒక దానిలో లోపాన్ని మరొకదాని చేత పూరింప చేస్తారు.

సాహితీ వికాసానికి రచయిత కృషి మాత్రమే చాలదు అని చెప్పుకున్నాం. సాహిత్యం అంటే రచయితకూ పాఠకులకూ, ఉభయులకూ చెందుతుంది.

ఇందుకు ఆత్మాశ్రయ (Subjective) పరాశ్రయ (Objective) పంథాలు రెండూ అవసరం కవికి. ఈ పంథాల్లోని పాంథుడే శ్రీ పాండురంగరావు!

డా॥ చల్లా రాధాకృష్ణశర్మ
తెలుగు శాఖాధ్యక్షులు
మధుర కామరాజ్ విశ్వవిద్యాలయం
మధుర – 625 002.

నా కాంక్ష

"ప్రకృతి ఇచ్చిన వెదురు
స్థాణువు
మనిషి మలిస్తే మధుర
వేణువు...."

తీయని భావన! మనిషి చెయ్యి తగిలేసరికి స్థాణువు వేణువుగా రూపుదాల్చింది. అది ఎన్నెన్నో నాదాలు పలికింది. సహృదయ లోకాన్ని అలరించింది. మానవుని మహిత శక్తికి ఇది ప్రబలోదాహరణం.

సృష్టిలోని ప్రతి అణువులోనూ పరమాత్ముడు మహత్తరశక్తిని నిక్షేపించాడు. ఆ మహితశక్తిని లోకకల్యాణశక్తిగా తీర్చిదిద్దడం మానవ ధర్మం. తాను ఆనందించి ఇతరుల్ని ఆనందింప జేయడం మానవ ధర్మం. ఇదే సృష్టి ప్రబోధం.

ఈ ఉదాత్త భావాన్ని మిత్రులు శ్రీ పాండురంగరావుగారు వెలార్చినవైనం పరిశీలనార్హం. ప్రకటించే భావం ఆలోచనామృతంగా ఉండాలి. అదే సమయంలో మధురమోహనంగా వినిపించాలి.

కవితకు నేడు పూర్వమున్నంత ప్రచారం లేకపోయినా, కవితా సంహితల అమ్మకం అంతంత మాత్రంగా వున్నా, తెలుగులో కవితా సంపుటులు పరశ్శతంగా వెలువడుతూ వుండడం గమనించదగిన అంశం. తెలుగువారికి కవితపట్ల తులలేని అభిమానం కలదని యీ విషయం వ్యక్తం చేస్తున్నది. అయినా ఏదో ఒక ప్రత్యేకత లేకపోతే, కవితా సంపుటి పఠితను ఆకట్టుకోలేదు. భావ సంపద పుష్కలంగా ఉండటంవల్ల "సాంధ్యవేళ" గేయ సంహిత సహృదయలోకానికి షడ్రసోపేతమైన విందు సమకూరుస్తుందనటం చర్వితచర్వణం.


"పాతను పాతేశామనుకున్నా
కొత్తను సొంతం చేసికోలేకున్నాం.
మేధ పెరిగి పోయిందనుకున్నా
మమతను పెంచుకోలేకపోతున్నాం...."

ఎంత నిజం! నగ్నసత్యాలను నాజూకుగా చెప్పడం శ్రీ పాండురంగరావుగారికి వెన్నతో పెట్టిన విద్యగా కనిపిస్తున్నది. ఈనాడు చాలమంది మనస్సులో మెదిలే ఈ భావాలను ఆయన పరమ రమణీయంగా తెలియజేశారు. భావం ఒక్కటే కాదు ప్రధానం. ఆ భావాన్ని సహృదయలోకం హర్షించేలా చక్కని భాషలో వ్యక్తం చేయాలి. అప్పుడే ఆ భావకాంచనానికి తావి అబ్బినట్లవుతుంది. ఈ విద్య చక్కగా తెలిసినవారు కావడంవల్ల, "స మ త వి రి సే నా?" మొదలైన కవితలలో కారాలు మిరియాలు నూరలేదు పాండురంగ రావుగారు. కటూక్తులతో కాకుండా కమనీయంగా తాను చెప్పదలచిన భావాన్ని వెలార్చినప్పుడే, కవి వాక్కు అనంతమైన శక్తిని సంతరించు కుంటుందని నా నమ్మకం. శ్రీ పాండురంగరావుగారి లేఖిని నుంచి ఇలాంటి గేయ సంహితలు ఇంకా వెలువడాలని నా కోరిక.

24-11-85
మధుర

— చల్లా రాధాకృష్ణశర్మ

కృతి సమర్పణ



ప్రాతః స్మరణీయులు :

స్వర్గీయ శ్రీ అల్లాడి నీలకంఠశాస్త్రి (మామయ్య)

,, ,, కావేరమ్మ (అత్తయ్య) గార్ల

స్మృతికి భక్తి పూర్వకంగా –

—పింగళి పాండురంగరావు

ఇందులోని కవితలు





మోహన వంశీ

ప్రకృతి ఇచ్చిన వెదురు
స్థాణువు
మనిషి మలిస్తే మధుర
వేణువు.

ఊపిరూదితే
కోటినాదాలు
శతకోటి గీతాలు
సహస్రకోటి
మృదుల హృస్పందనాలు.

మసృణ కపోలాలు
రుచిర పల్లవాలై
వెలిగిస్తాయి చిరుహాసాలు
వెలుగు తోరణాల్లో.

ఆలపిస్తే నాదసింధువు
అలరిస్తే రసికజన బంధువు
నిఖిల జగతి సమ్మోహనమై
నిశీధినే వెలిగిస్తుంది.

ఎండిన గుండెల స్పృశించి
ఉగాది సొగసుల చిగురిస్తుంది
వల్లకాటి వైభవాన్ని
గతంగా మారుస్తుంది.

సృష్టిలోని ప్రతి అణువులో
మహితను పేర్చాడు పరమాత్ముడు,
ప్రీతి పొరలు కూర్చాడు మానవుడు.

ఆ మహితను ఆవిష్కరించుకుని
ఆనందించి, ఆనందింప చేయడం
మానవ ధర్మం
అదే సృష్టి ప్రబోధం
ఇదంతా జగత్‌స్రష్ట(కు) వినోదం!

(మయూరి — 9–8–85)

నా చిరస్వప్నం

విధి కూడ నిరోధించలేని
వికృతపు లేమి వికటాట్టహాసంలో
వల్లకాటిలో వినిపించే
చింతల చితాగ్ని ఘోషల్లో
తర తరాలుగా దగ్ధమౌతూ
ప్రాణాన్నంతా కళ్ళలో నిల్పుకున్నాయి
కొన్ని అస్థి పంజరాలు ... .
అస్థిపంజరాలు కావవి
ఆకలి లతా నికుంజాలు !
పరపీడనలో విరిగిపోయిన కాంతిపుంజాలు
తూట్లు పడ్డ ఆ ఊపిరి తిత్తుల్లోకి
ఇంత ఊపిరినైనా ప్రసరింపలేని
నికృష్టపు నిర్వాకం
నాది, అనాదిగా—

అమేధస్సుకు
అనుక్షణం అనివార్యం
అనల జ్వాలా సాంకర్యం
ఎన్నాళ్ళకో ఉక్కుచట్రాల నుండి
ప్రవిమల మానవ మేధస్సు
ప్రమోద కాంతులు సంతరించుకునేది !
విజ్ఞాన దీప్తుల విలీనించుకునేది !
విశ్వాన్నంతా వెలుగు భాండంగా
అనంత రోచిర్నివహంగా
రూపుదిద్దేది? తానూ జ్వలించేది?
ఎన్నాళ్ళకో! అది ఎన్నాళ్ళకో!!
ఆ మేధస్సు వెలగాలి
నవ ఉషస్సు కురియాలి
ఇదే 'నా చిరస్వప్నం'
ఈ స్వప్నం ఫలియిస్తే
ఆ ఫలితం బలమిస్తే
మనసున విరియును మరోనందనం
నవ జీవనానంద సంస్పందనం!!

(ఆకాశవాణి — విజయవాడ)

వివేచన

తను నాటిన బీజాలే
పలువిధాల భుజాలై
ప్రకృతిలోని ప్రతి ప్రాణిని స్పృశిస్తూ
సర్వస్వాన్ని త్యజిస్తూ
పంచుకుంటూ పోతున్నాయి.
పరహితామృతాన్ని
ప్రతిఫలాపేక్ష లేకుండా!
కాని—
తను మాత్రం సిగ్గుపడటంలేదు
తనవంతు సుంతైనా
స్వార్థ త్యాగం చేయాలని!
మానవాభ్యుదయ యజ్ఞంలో
తనూ ఓ సమిధయై బ్రతకాలని....
వివేచించి చూడలేని వింత దివాంధుడు
ఈ మానవుడు!

(ఆంధ్రజ్యోతి(దిన), 'ఈవారం కవిత' – 23-6-85)

చైతన్య ప్రభాతం

పగలంతా వెలుగు
రాత్రంతా చీకటి
అది సృష్టి
అని మానవుని అనాది దృష్టి
కాని — ఇపుడో
పగలంతా చీకట్లు
చీకట్లో వెలుగుకు ఇక్కట్లు
ప్రజ్ఞాపాటవాలు నేల కరుస్తున్నాయ్!

నీతి నియమాలు నేల పాలవుతున్నాయ్!
గుణాకృతులు ఘొల్లుమంటున్నాయ్!
మానవ ధర్మాలు మంట కలుస్తున్నాయ్!
ఈ చీకటి పగళ్ల ముసుగు నీడల్లో
కునుకు తీస్తున్నాయ్—
మానవతా వెలుగు జాడలన్నీ
పగటినికూడ తన కుక్షిలో నిక్షిప్తీకరించుకుని—
చీకటి రాజ్యం చేస్తుంది నిశ్చింతగా
పగటికి పట్టం కట్టాలి
చీకటిని చిత్రంగా హింసించాలి!
ఆనాడే విడివడతాయి
తరగని చీకటి పొరలు
అపుడే ఉన్మీలించును
బడుగు జీవన కుసుమాలు
అదే నవోన్మేషం!
అపుడే "చైతన్య ప్రభాతం"

(ఆకాశవాణి — విజయవాడ)

అక్షరార్చన

ఎట్టనార్యా ! ఒక్కమారిటు చూడు !
దివి నుండి
ఈ భువిలో, నీ జన్మస్థలిలో
నీ స్మృత్యర్థం
మేం పండించు కుంటున్న
ఈ కవనోత్సవ వైభవాన్ని
నీ ప్రబంధోజ్జ్వల కాంతి వనాన్ని
నీ సాహితీ సుందర నందనాన్ని
కవిరాజు పాదాలనే
కూర్మితో గౌరవించిన
రాచరికం కాలం చేసినా
రిక్త వాగ్దానాల రుధిర ధారల్లో
కుత్సితపు క్రీనీడల కౌగిళ్ళలో
నలిగి నశించే
ఈ ప్రజాస్వామ్య యుగంలో కూడా
నీ సుందర సాహితీ సౌధంలో
నిబ్బరంగా కాలూని

కనుల పండువుగా ఈ
కాస్తంత ఊపిరి పీల్చుకునే భాగ్యం
ఆ కలస్వనాల పులకించే ఈ క్షణం
మా కంటి పాపల్లో మెరిసి పోతున్నందుకు
మేమంతా హర్షిస్తున్నాం !
నీ స్వర్ణయుగాన్ని విస్మరించ నందుకు
మేమంతా గర్విస్తున్నాం !!

ప్రబంధ పరమేశ్వరా !
గీర్వాణాంధ్రముల మథించి వేలార్చిన
నీ రసమయ కావ్యసృష్టి అసమానం
భారతాంధ్రీకరణ అసంపూర్ణ
అంధకారపు పొరలు తొలగించ
అరణ్య పర్వ శేషోన్నయం కావించి
సంపూర్ణ భారతాంధ్రీకరణ జ్యోతిని
వెలిగించిన నీవు
స్ఫూర దరుణాంశుడవు !!
ప్రాజ్ఞుడవు !!
అఖిలాంధ్ర యశోవిభుడవు !
లక్షణాభిదేయంగా "శంభుదాసుడవే" కాని
శివకేశవ భేద మెరుగని ధన్యాత్ముడవు !!

మహాకవీంద్రా !!

నీ కవితావరణానికి
ప్రౌఢాంచిత శబ్దసారులైన
నన్నయ్య, తిక్కన కవినాథుల
కీర్తి రాజహంసల మధుర గీతికల నాలించి
నీ వావల క్రౌంచరీతి
కూయ గడంగి నటుల వాక్రుచ్చిన
నీ కల్పనా చాతురిలో
నినదించిన నీ భక్తి భావమనల్పం
నిల్చిపోవునులే ఆకల్పాంతం

నీ స్వతంత్ర రచనా శిల్పాన్ని
మనోజ్ఞ భావవల్లరితో
మహోన్నతంగా పేర్చి, తీర్చిన
నీ "నృసింహ పురాణం"
పురాణ ధోరణినే పులుముకున్నా
ప్రబంధ పారిజాతంగా విలసిల్లు
ఈ జగత్రయం నిలచి భాసిల్లు వరకు
భావ సౌందర్యం పుణికి పుచ్చుకున్న
నీ "హరివంశం"
ఒక అసమాన ప్రబంధ రాజం

మంజుల పద రంజితమై
రసాస్వాదనాను భూతుల్లో
రసిక జన మనోభిరామమై
కడు రమ్యంగా నిలుచు
ఈ జగతి నిలుచు వరకు

కవీశ్వరా !

పరమ ప్రామాణికమైన
నీ కావ్య రచనా శిల్పాలు
నన్నయ తిక్కన కవితా లతాంతాల్లో
మిళితమై మృదుల శయ్యలయ్యాయి.
నీ కవితా విద్యుల్లత విరబూసిన
జ్ఞాన కాంతి సుమశోభలు
నా గుండెల నిండా అల్లుకోవాలి
ఈ చివికిన బ్రతుకు బాటల్లో
స్ఫూర్తి నింపి సురభీకరించాలి.

నిత్య సౌమ్యమతీ !
నీ అపూర్వ రచనలన్నీ
కథా కథన చాతురిలో
ప్రౌఢ కవితా రీతుల్లో
ప్రబంధ దేహాళిపై.

స్వచ్ఛ సుందరము లైన తళుకులద్దాయి.
అలభ్యమైన నీ "రామాయణం"
ఆంధ్ర కవితా మణిహారాన్ని
తానే కనుమరుగై వెక్కిరిస్తోంది !

కవీంద్రా !
ఈ తీరపు విఫల మానవ వేదనల్నీ
ఈ సంఘర్షపు బ్రతుకుల నీడల్నీ
సుదూర తీరాలకు తరిమి వేసి
నితాంత ప్రశాంత పథంలో
ఈ జీవన యానం సాగించేందుకు
ఈ సాహితీ జగతిలో
విరబూసే నా ప్రతి కాంతి కిరణం
నీవు దీప్తించిన ఉజ్జ్వల శోభనుండే
నేను వినిపించే ప్రతి గీతిక
నీవు మేళవించిన మధురవాణి నుండే
ఆ నిశ్చల నీల సాగరంలోకి
నేను ప్రస్థానించే క్షణం వరకు
ఈ మృణ్మయ మాయాజాలం
నన్ను వీడే తుది క్షణం వరకు
ఈ జీవిత కరాళ హేళలు
నా నుండి శాశ్వతంగా నిష్క్రమించే వరకు

నీ మల్లె పొదరిండ్ల మాటున
నీ ప్రబంధశాంతి వనాల నీడన
నన్ను కాస్త పరుండనీ !
నీ వాగర్థాల వసంత వనవాటికలో
నే పరభృతమునై విహరించనీ
నీ జాను తెనుగు తేనియలో
నే భ్రమరమునై పరవశించనీ !!

ఎఱ్ఱనార్యా !
సత్యపదార్థ పరిష్వంగం నాకు
సంప్రాప్తం అయ్యే వరకు
నన్ను వీడకు
నేను ఈ లోకం వీడే వరకు
వీడి చిరనిద్రాస్థలి చేరేవరకు
చేరి శాశ్వతంగా నిద్రించే వరకు
కాని—
ఇప్పటికిదే, అందుకో !
ఈ వేవన్నెల మేల్పచ్చల మధ్య
నేనర్పించే ఈ సుమదళ 'అక్షరార్చన'ను

(9-6-85 తేII న ఒంగోలులో 'ఎఱ్ఱన పీఠం' అధ్వర్యంలో
నిర్వహించిన కవిసమ్మేళనంలో వినిపించ బడిన కవిత)

రైలు పట్టా తప్పింది

వల్లమాలిన వాగ్దానాల
ఆటోమేటిక్ సిగ్నల్స్ భరోసాలో
బండివేగం భేషగ్గా ఉంటుందనుకున్నా !
ప్రయాణాన్నంతా సంబరంగా గడపాలనుకున్నా !!

కాని—
చిత్తశుద్ధిమేకానిజం చెప్పకుండానే
చిత్తు చిత్తుగా ఫేలయి కూర్చుంది.
స్వార్థం డైనమైట్ చూస్తుండగానే
సమాజోజ్జ్వల గమ్యాన్ని
సమూలంగా పేల్చేసింది.

అందుకే—
ప్రగతి రథం
తిరోన్ముఖం అయింది
ప్రజాస్వామ్య పథం
తిమిరో న్మీలన మైపోయింది.

ఇక నిర్భాగ్యపు ప్రజకు
కడకు మిగిలిందేమిటి ?
పరమ పావన త్రిపుండ్రం !
ఎడద భీతిల్లు పర్జన్యం !!

(30-10-85 ఆంధ్రప్రభ వారపత్రిక)

శిధిల కిరీటం

విప్పారిన చేతికి
ఐదు వ్రేళ్ళున్నాయ్
పొట్టిగా—పొడవుగా
విడివిడిగా—
బిగించిన పిడికిలి లోనూ
ఆ అయిదే వుంటాయ్
జట్టుగా, కలసి కట్టుగా—
ఈ ఉక్కు పిడికిలి బిగిలో
నిబిడీకృత అజేయ జనశక్తి
అణు శక్తిని మించగలదు.
సృజన శక్తిని పెంచగలదు.
జాతి కేతన మెత్తగలదు.
అదిగతాన్ని వెలిగించిన అజేయ మణిసూక్తం:
కాని—నేడో !
పిడికిలి సడలి పోతోంది
ఐదు వ్రేళ్ళు విడిగా—వడిగా
విశృంఖలంగా వికర్షిస్తున్నాయ్ !
పరాఙ్ముఖులై పరావర్తిస్తున్నాయ్ !
అల్పానల్ప వై మనస్యాలు

జాతి మతాది విద్వేషాలు
జాత్యనైకతకు పీఠం వేస్తున్నాయ్
జాతి దర్పణం ముక్కలవుతోందా ?
బడుగువాని బ్రతుకు బీడవుతుందా ?
చేరువవుతోందా !
అరాచకానికి అఖండ విజయం
ప్రళయకాల భయద పర్జన్యాంధ కారంలో
ప్రగతి పథానికి "శిథిలకిరీటం" తథ్యమేనా ?
కుటిల నీతి భ్రూకుటిలో పసిడి జల్లులు విరిసినా ?
అలా అవడానికి వీల్లేదు
ఆవిర్భవిస్తుంది ఏనాటికైనా
నిరుపమాన, నిష్కళంక ప్రజాస్వామ్యం
నిష్ఠురధన స్వామ్య విముక్తి లోంచి—
ప్రభవిస్తుంది విధిగా
ఈ అప్రజాస్వామ్యపు చేతల్లోంచి
అసలు సిసలైన ప్రజారాజ్యం !
ఆనాడే వర్తిస్తాయ్ !
పరవశంలో పయస్వినిల్లా
సమతాదర్శన పరభృతాలు
నవ మానవ వన సీమల్లో
ప్రగతి నింపి వెంగలిస్తాయ్
సుగతి పథ శాంతి సుమ శోభలు !!!

మ ణి దీ పా లు

నా భావాంబర వీధుల్లో
మీ బులిబులి నడకల అతికిడిలో
చిరుచిరు చూపుల సింగారంలో
తొలకరి జల్లుల మెరుపుల్లో
మిల మిల మెరిసే మణి దీపాల్లారా !!
రమ్య రమణీ కపోల కాంతులన్నీ
మి కమనీయ దరహాసాల సన్నిధిలో
తెల వెల పోయి
కలలై మిగలక
బిర బిర రాండి !
నా ఎద చేరండి !

("మయూరి" వారపత్రికలో ప్రచురితం)

ప్రజా హి(హ)తం [?!]

కుక్షి నింపుకోవడమే
కైవల్యమనుకునే దౌర్భాగ్యం వల్లనే
కువలయ వల్మీకంలోని
కోటి అవినీతి భూరి భుజంగాలు
కట్టు బట్టలేని కటిక నిరుపేదల్నింకా
కుత్సిత దంష్ట్రాలతో కాటు వేస్తూనేవున్నాయ్ !
కౌమారంలోనే వల్లకాటికి సాగనంపుతున్నాయ్ !!

కాని—
అనూచానంగా రాజీపడ్తూనే వుంది
ఈ రోగిష్ట సమాజం నికృష్టంగా
ప్రజాహిత సూక్తులతో—
నిరాఘాటంగా ప్రవచిస్తూనే వుంది
రిక్త వాగ్దానాల సుధాసూక్తుల్నింకా !

అందుకే—
ఈ దుర్వార, దుర్గంధ
రాజకీయ కాలుష్యాన్ని
నిర్మోహంగా అపకర్షింపనిదే
ప్రజాహితం శూన్యం !
ప్రజాక్షతి తథ్యం !!

ఇంకెన్నాళ్ళో !!

అచ్చట
ఆ ఒక్క బింబానికి
ఇచ్చట
కోటాను కోట్ల ప్రతిబింబాలు.
ఇక్కడి ప్రతి వస్తువుకేదో రూపం
ప్రతి రూపానికేదో నామం
ఆవిర్భవించిన ఈ భవ్య ప్రకృతిలోని
ప్రతి రూపాల్నిలాగే
సహస్రాధిక నామధేయాలతో

పలురీతుల అలంకరించాం.
ప్రతి ధ్వనికి పలుకు కూర్చాం.
ప్రతిధ్వనిగా మాటనేర్చాం.

ఇక్కడి—
ప్రతి—బింబానికి
ప్రతి బింబాలు
నిర్దుష్టంగానే ఉన్నాయ్ !
కాని పరమాత్మ ప్రతిరూపమైన
మానవాత్మలో మాత్రం
నిర్దుష్టత కానరాదు
వైశిష్ట్యపు వెలుగు చొరదు

అందుకే—
మధుర శాంత మానవలోకం
మరుభూమిగా మారిపోకుండా
ఈ సృష్టి వైకల్యం నుండి
ఆ అలభ్య పరమార్థన్ని
సంప్రాప్తించు కొనేదెలాగో ?
అదెన్నటికో !!

ఈ మానవ మహాసాగర తీరాన్నించి
చిరశైథిల్యం నుంచి నవచేతనను
సృజించుకొనే భాగ్యమెన్నటికో ?
అదెన్నటికో ??

తమోవాహినిలో మునిగి పోయిన
ఈ హేమంత నిశీధి నీడల జాడల్లో
ఆ వసంత ప్రాభాత సుమశోభల్ని
నేను పండించుకునేదెన్నటికో ?
అదెన్నటికో !!

కలల పండుగ కనుల నిండుగ
నేనాకాంక్షించిన సమాజశ్రేయం
నా కన్నుల నిలచేదెన్నటికో !
ఇంకెన్నటికో !!

ఈ శిలాజీవుల శిథిల హృదయాల్లో
సుఖజీవన కాంతి సుమాలు
విరబూసేదెన్నటికో ?
నేనది కాంచి పరవశించేదెన్నటికో !
ఇంకెన్నటికో !!

శేష ప్రశ్న

ఓటు హక్కున్న ప్రతి
బలహీనుడు కూడ
ఆరాధ్య దైవం ఈనాడు
అందలం ఎక్కాలకునే
ప్రతి అధికార బధిరునకు
ప్రతి దురహంకారాంధునకు—

ఓటు వేసేవరకు
అతని కుటీరం కైలాసం
అతని ఓటు కోటిరం
అతని యోగం—క్షేమం—
అన్నీ కూడా కైవల్యంలా
అభయ ముద్రలో భద్రం—

అయితే—

ఆ బలహీనులే నిర్దయగా
అధికారపు రక్తధారల్లో
కులరక్కసి విషకోరల్లో
దయనీయ స్థితిలో దాటిపోతే
తనకేమీ పట్టనట్టు
తనదేమి పోనట్టు
అధికార దర్పం ఇన్నిరోజులూ
అమానుషంగా శవజాగరణ చేస్తున్నదంటే
మానవత్వం
ధూర్త ధూసరంలో కూరుకుపోయిందా ?
సభ్యసమాజం
సాటివాడనే జాలినే కోల్పోయిందా ?
నవనాగరీకం
నవ్వుల పాలవుతానేమోనని ప్రక్కకు తప్పుకుందా ?
పడగ విప్పకూడని
ప్రజాస్వామ్యం కూడ
పరువు కోసం పాకులాడిందా ?
పసికూనలను అనాధలను చేసిందా ?

కడకు న్యాయ పరిమళంకూడ
ఆ భయంకర శవదుర్గంధంలో
శాశ్వతంగా విశ్రమించిందా ?
సభ్యసమాజపు ముసుగలోని
ఓ నాగరీక ప్రపంచమా !
నీ నిర్వాకం ఇదేనని తెలుసు
నాకు అనాదిగా—

కాని
ఏనాటికైనా
నీ నిష్ఠురతకు
ఈ దౌర్జన్యానికి
నేను చరమగీతం పాడలేనా ?
వెలలేని విలసత్కరణను
విశ్వమంతా నింపలేనా ?
అనేదే పకృతి అనాదిగా
కాలానికి వేస్తున్న సూటిపశ్న !
ఇదే నా "శేషప్రశ్న" కూడ ?

(ఆకాశవాణి—విజయవాడ)

భేదం!!

ముద్దులొలుకు గుమ్మ
మంచు బొమ్మ
తన వింత సోయగాల్ని
కొద్ది క్షణాలైనా
కాంతి రేఖల్లో
ఉన్మీలించి
ధన్య జీవిగా
పూర్వ స్థితి లోకి
జారి పోతుంది.

కాని—
ఈ పరమ మాయావి
ఈ మట్టి బొమ్మ మాత్రం
ఇహలోకపు వ్యర్థభోగాల్ని
నిత్యమనుకొని
స్వార్థోన్మాదంలో
ప్రజాభ్యుదయాన్ని కాలరాస్తూ
తనకు తెలియని ఒక్క క్షణంలో
నిర్గమిస్తూనే వుంది
స్వార్థజీవిగా ముద్రవేసుకుని
పాపభారాన్ని మూట కట్టుకొని.

జాతితేజం

సమాజ శరీరానికి
యువశక్తి హృదయ సన్నిభం
ఆ శక్తి—
క్రమ స్పందితమై
సుశిక్షితమైనపుడే
మానవ జాత్యున్నతికి
మణిదీప మౌతుంది.
అపుడే—
ఆ జాతి కీర్తి కేతనాలు
నింగినేలుతాయి.

(అంతర్జాతీయ యువజన సం॥ సందర్భంగా)

విజయం సిందూరం

మాన్య ఆరుద్ర మహోదయా !
ఈ శుభోజ్జ్వల సాహితీ వేదిక నుంచీ
అందుకోండీ ! ఈ
అభినందన మందారం
దిద్దేమా ! మీ నుదుట
అభ్యుదయ సిందూరం.

మీరు పూరించిన
అవిరళ అభ్యుదయ శంఖారావం
మీరు వరించి, వర్షించిన
శాస్త్రీయ సామ్యవాద పర్జన్యం
నలుదెసల ఘూర్ణిల్లి గర్జించింది

నిర్భాగ్య జీవితాల మోడులు చివురించేందుకు
నీరవ నిశీథుల్ని వెలిగించేందుకు.

తాడిత పీడిత జనావళి
నిజజీవిత సాఫల్యాల తొలి పొద్దుల్లో
ఈ సముద్దీపన సంరంభ సంబరంలో
కృతజ్ఞతాక్షతల్ని కురిపిస్తోంది.

మహామనీషీ !
వర్తమాన దుర్వార అధర్మ దుర్గంధంలోంచి
నిష్కృతించలేని ఈ సమాజాన్ని
చూచి భరించలేని కరుణామూర్తిగా
అకలంక అభ్యుదయ వాదిగా
విరబూస్తున్న మీ హృదయ నందనం
పదిపదుల వత్సరాలింకా పరీమళించాలి
ప్రపూర్ణ జనాభ్యుదయ శిఖరాన్నందిన
లోకోత్తర కీర్తి మీది కావాలి

మహాకవీ !
ఈ అఖండ ముగ్ధమోహన కావ్యారామంలో
అనేకానేక రమ్య రసరూపాల
అసాధారణ శిల్పివై

అంత్య ప్రాసా ప్రజ్ఞాధురీణుడవై
ఈ దౌర్భాగ్యపు ధనస్వామ్యంలో
అసంఖ్యాక దీనజనుల పాలిటి
గడుసరి వకీలువై
సమసమాజ స్థాపనా తత్పరుడవై
ప్రభాసించిన నేటి మీ
అరవై యేళ్ళ ఆదర్శ జీవితం ధన్యం
అవ్యయానంద సంభూతం
ప్రియ జనాభ్యుదయా సంస్పదనం

ఈనాటి మీ పెళ్ళిపందిట్లోకి
వేవెలుగుల శోభలతో
"ముక్కోటి దేవతలు ఒక్కటై" విచ్చేశారు.
"ఈ వేళ జగమే
మధురంగా మారి" పోయింది
ఆరుపదుల ఆరుద్రగారూ !
'త్వమేఽవాహమ్'; నమస్తే

(15-9-85 న చీరాలలో జరిగిన "ప్రకాశంజిల్లా రచయితల మహసభ"లో డా॥ ఆరుద్రగారి షష్టిపూర్తి ఉత్సవంలో వారికి సమర్పించిన అభినందన గీతం)

విరిబోణీ!

విరిబోణీ
విశుద్ధ వినీలాభ్రం నుడుట
విభావరి పొదిగిన తారల తోరణాలు
కలల పొరలుగా, కనుల విందుగా
ఈ మృదులాస్థికా పరిష్వంగాభిలాషతో
మనమున నిండెను వైజయంతిగా
ఇది నావైకల్యమేనా ? వేక
నీవే ఆ వికుంఠాంశమువా !!
వైజయంతం ప్రాంగణాన వేచిన
విరహతప్త వైఖానసుడనునేను నమ్ము ?

జనాభ్యుదయం

మానవాత్మ అధోగతి
చూడ చూడ కన్నీరు వెగులు
మానవ జన్మ కల్గుటయే
మహోన్నతమందు బుధులు.

ప్రభూ !
ఆత్మోన్నతి నీవొసగినా

నరుడు హ్రస్వ దృష్టినే నేర్చినాడు
మానవ దృష్టి ఊర్ధ్వం
మానసరీతి కడురమ్యం
మనోగతి మరి పదిలం
కావాలనేకదా — ప్రభూ !
సృజించావు ఈ మానవుణ్ణి

మరి ఈ వైపరీత్యాలెందుకు ?
ఈ కల్లోలం దేనికయ్యా ?
నీ ధ్యేయం సుగమం చేసి
మా గమ్యం చేర్చరాదా !

అగాధాలకు అంతులేదా ?
అగమ్యాలకు అర్ధంలేదా ?
అనర్ధాలకవధుల్లేవా ?
మా పథం సుగమం చేసి
మాగమ్యం సఫలంచేసి
జనాభ్యుదయం కూర్చుదేవ !!

నవచేతనా కాహళి

నిర్భాగ్యపు దౌర్భాగ్యం
నిత్యం నిను కూల్చివేస్తూనేవుంది
నీ దుర్వార నిర్వేదం
దైన్యంలో దహించుకపోతూ
విధి విధానమంటూ నిర్దిస్తునేవుంది— నాటికీ—నేటికీ !

చిరహేమంతం నిన్ను
చైత్రంలోనే వరించిది
నీ నిరంతర క్షుధార్తి కీలలు
రమ్యావాసంతికా వీచికలై
నీ మృదుల హృదయాంతరాళాలను
ఈనాటికీ స్పృశించనూలేదు
నీ జీవితమొక
తీరని వ్యధగా మిగిలింది.
మారని కథగా మారిపోయింది.

వాసివీడిన నీజీవితాన్నీ
మృణ్మయ పాత్రగా చిత్రించిందీ
దౌష్ట్య సమాజం అనాదినుంచీ
నీ జీవితసుమకేదారం
దౌర్బల్యపు కంటకీ పరిష్వంగంలో
క్రూరంగా నలిగి నశించి పోతూనేవుంది
జగరూకతా సూక్తితో
నిష్క్రియా ధూర్త నాదంతో
అందుకే—
ఈ క్షణమే సంరావించాలి ధృతితో
నవచేతనా కాహళిని
సంలీనించాలి విధిగా నీ చైతన్యపు ధీశక్తిని
జాగరూకతా ప్రదీప్తిలో
అపుడే—
అప్రళయకాల ప్రభంజనంలో
ఒరిగి ముక్కలై పోతుంది.
ధనాఢ్యుల హేమ పాత్రాన్నం
ఆనాడే—
సుందర సమసమాజ సాధావరణంలో
నవ్య విపంచికా మధుర విభాతంలో
విరభూస్తుంది నీ జీవిత లతాంతం!!

చి తం ది వ్వో

ప్రభూ!
హాతినిండిన జగతిలోన
ఇది గతి తప్పిన పథమేమో;
నా గానం ఆగిపోతోంది.
నీ ఉనికికి కాలం చెల్లిందేమో
నా ధ్యానం నిర్జీవమైపోతోంది.
ఈ శిలామయ జీవితాల్లో
మానసవీణ మూగపోతోంది
వ్యధాభరిత జీవిత గాధల్లో
ఎడద మోడువారి పోతోంది.

దుర్భర విషాద గీతాలాపనల్లో
అనశ్వర నాదం నశించిపోతోంది.
అనంత నిర్వేదాకాశంలో
ఆశలతార అదృశ్యమౌతోంది.
అందుకే— ప్రభూ !
చిత్ర విచిత్ర చైత్రపరిమాళాలన్నీ
ఇకనైనా దూరం చేయకు.
రాగద్వేషాదుల ఈ కూడలిలో
సత్యాన్నికనైనా చావనీయకు.
నిర్భాగ్యపు జీవితాల్లోంచి
సుధాకధల్ని తుడిచివేయకు.
మేం కన్న కమ్మని కలలన్నీ
మమ్మల్ని కరుణించకపోయినా
ముసిరిని ఈ అమవసనిసిలో
నన్నొక చిఱుదివ్వెనైనా వెలిగించనీ.
మతద్వేషాదుల్ని దహించేస్తూ
అనురాగ సుధల్ని పండించనీ
అభాగ్యుల ఆక్రందనలాలించి
అన్నార్తిని తొలగించే శక్తినివ్వు.
అపుడే మా దీపావళి
కాకపోతే అది శాపావళి.

సమత విరిసేనా? (!)

కులరక్కసి సమసేనా?
సమభావన విరిసేనా?
అనాది నుండి మారని ఈ
నరుని ఆటవికనైజం
ఈ నాటికీ మారనేలేదు
దానవరోదన వీడనేలేదు
దారుణ హింసకు తుదిలేనేలేదు.

ఆనాటి పదిరికుప్పం, కృష్ణాపురం
ఈనాటి కంచికిచర్ల, కారంచేడుల
దుష్టకలల విలయ తాండవంలో
కులరక్కసి క్రూరపరిహాసాగ్నికి
అనుక్షణం ఆహుతిఅవుతూ

క్షణం క్షణం బుగ్గిని మిగుల్చుకుంటున్న
నరరూప కీటకాలుగా
అవి అలా వస్తూనే ఉన్నాయ్!
మనం ఇలా చూస్తూనే ఉన్నాం!
నవనాకరికతకివి సంకేతాలా?
నాగజెముడుకు పంగనామాలా?

ఈ ఇరవయ్యో శతాబ్దపు
అనాగరిక స్వామ్యంలో
విలువకట్టలేని నిండు ప్రాణాల్ని
ధనంతో కొలుస్తూనేవున్నాం
తిరిగిరాని మానాన్ని, మాంగల్యాన్ని
భుజబలంతో బ్రద్దలు చేస్తూనే ఉన్నాం.
పిన్న వయసులోనే విధవైతే
విధినే నిందిస్తారీ అధములు

శ్రమజీవులు ఆక్రందించి, ఆలమటిస్తే
అహం పంచుతోంది పారితోషికప్రసాదాలిన్ని
అధికారాన్ని నిలదీసి, ఆక్రోసిస్తే
సానుభూతి జల్లులవెల్లువలో
కపటనాటకాలు కొట్టుకపోతాయ్!
బలదర్పానికి బాగాతెలుసు

బడుగుజీవి ప్రతీకారేచ్ఛ
పది క్షణాల్లో పరిలుప్తిస్తుందని
నిరుపేద హృదయతాపం
ప్రతి రూకలో నిద్రిస్తుందని.

కోటి కారంచేడులైనా
కరుణను సృజించలేవు
జ్ఞాననేత్రాన్ని తెరువనూలేవు
కనుకనే—
హృదయంలో సృజనశక్తి
మానవమస్తిష్కంలో
అచంచల మేధాశక్తి
ప్రభలించని భయదాంధకారంలో
ఈ కాలసాగర గర్భంలోపొంచిన
వివిధ విద్వేషాలబడబాగ్నులు
ఎన్ని ప్రాణాలనైనా బలిగొంటున్నాయ్.
అజ్ఞానాంధకారాన్ని కొలుచుకొంటూ
అనురాగ సుధల్ని కాలరాచుకుంటూ
ఎంత కాలమిలా వ్యర్థంకావాలో
ఈ చరిత్ర పుటల్లో సమత వెలుగులు చూచేందుకు
ఈ బ్రతుకు బాటల్లో మమతలు విరిసేందుకు.

మోదం - ఖేదం

ఈ లోకంలో
మోదం కంటే ఖేదం అధికం
మోదం క్షణికం
ఖేదం నిత్యం సత్యం
మోదం ఇహలోక సంగతం
ఖేదం పరమార్థార్జనకు ప్రవేశద్వారం
మోదం పరవస్తు సముద్భూతం
ఖేదం ఆత్మోద్భవ పదార్థం

అందుకే—
విషాదాన్ని ఆహ్వానించాలి
ఆస్వాదించి అనుభవించాలి
వేదనా సముద్ర తీరంలోని
కరుణారుణ శోభల్లో
ఆత్మపరమాత్మల సంగమాన్ని
అవగతం చేసుకోవాలి
ఆత్మనేతకు చేరువవ్వాలి.

స్వేచ్ఛా తీరాన...

జననీ! భారతీ!
నీవు కన్న జాతి రత్నాలు
నిజపావన రక్తతర్పణంతో
అహింసా సమరంలో
వీర మరణాన్ని వరించారు
నీ దాస్య శృంఖలాల్ని
అపూర్వంగా ఛేదించారు.

ఆ నవ్య స్వేచ్ఛాసౌధంలో
సమతా వాయువులు నిండిపోవాలని

మమతా లతలు విరియాలని
సమ సమాజంగా మారాలని
నవమానవుడుదయించాలని
నవ్య భారత స్వప్నాల్ని
ఎన్నెన్నో, మరెన్నో
మనసు నిండా పండించుకున్నాం.

కాని— నేడో
ఆ మధుర స్వప్నాలన్నీ కూలిపోతున్నాయి
నభం విరిసినా అంధకారమే
నవ్యత అంటే వ్యర్థ ప్రలాపమే
మనిషి కడుపులో ఆకలి మంటలు
మనసు ముంగిటిలో మారణ హోమాలు
కడుపు చీలిస్తే హాలాహలం
పెదవి మెదిలితే కోలాహలం
హృదయం ప్రిదిలితే విద్వేషానల మయం
కన్ను తెరిస్తే నిరాశాగ్ని గుండం
సాధించింది అత్యల్పం అని తెలిస్తే
త్యజించాల్సింది అనైక్యతని గుర్తిస్తే
ప్రభవిస్తుంది సమభావనా యుగం
వినిపిస్తుంది నవజీవన రాగం.

అడుగు - జాడలు

అనురాగ జ్యోత్స్నా విలసితమై
రస రమ్య కాంతులీను నీవు
ఈ కమనీయ జగత్తరంగిణిలోని
నా మానస వీణా వేణికవా?

నిభృత సుందరాకృతివై
విచ్చేసి నాలో నిలచిన నీవు
నా కవితా రసరాగిణివా? ఝురివా?
జనప్రియవా? నా విధి కీలవా?

ఈ కపట నాటక రంగస్థలి
కుటిల సయనాంచలాల వలపు లోగిళ్ళలో
నిర్ఘృణ నిశీధి నీడల వాడల్లో
నిబిడీకృత అశాంతి గీతికారావాల్లో
నిన్ను సుంతైనా పోల్చుకోనైతి!

నా నేత్రాంచలాలు పండించిన
కలస్వనాల మధుర తరంగాల్లో
నా విధాతగా, ప్రియ సంధాతగా—

ఈ పాంచభౌతిక రూప లావణ్యాలు
సంగమిస్తున్నాయ్ పర్లోక విభుకౌగిలిలోకి
చీకటి చొరలేని తేజో రాశిలోకి
చలువ తెమ్మెరలు సమస్తం
సంగమిస్తున్నాయ్ ప్రశాంత సాగర గర్భంలోకి—

ఆ అడుగు – ఈ జాడలు – అన్నీ
అనుగమిస్తున్నాయ్
గుర్తులు కూడ పలుకలేని చూటిలోకి
అడుగుల ఔన్నత్యాన్ని గుర్తించలేక
ఆర్జించిన అనర్థాన్ని ఊహించలేక
ఊహించి భరించలేక
అంధకారపు పొలిమేరల్లో అలమటిస్తున్నాయ్!

అలజడుల ముంగిట్లో కౌగిలిస్తున్నాయ్!
మూల్యాంకన కతీతమైన ఆ
అడుగులు, ఆ అడుగుల సవ్వడులు
శాశ్వతాలు, శిరోధార్యాలు
గుర్తులు కోల్పోయిన ఈ జాడలు

అశాశ్వతాలు, అర్ధవిహీనాలు,
శుద్ధ ప్రలోభాలు—

కానీ—
నీ అడుగుల జాడలు
ఆ జాడలలోని నీ అడుగుల సవ్వడులు
నీది కాని ఆ అడుగు జాడెక్కడని
నిన్ను నీవే ప్రశ్నించుకున్నావా?
ఎప్పుడైనా? ఒక్క మారైనా?

నీ నడక జడమైనపుడు
ఆ అడుగు నీది కానపుడు
నీ గమ్యం అగమ్యం
అంతా మృగ్యం మ్లానం.

అందుకే—
ఈ జగన్నాటకంలో
మనల్ని మురిపించి, మైమరపించే
ఈ సమస్త అనల్ప వైభోగం
అనిత్యం, అచేతనా మయం.
ఇది వికృత విధి అందిస్తున్న
నిరర్థక వినోద ఫల సంచయం.

వికృత సంధి

ఇది సంధ్య!
ఇదే సంధి!
సంధ్య వెలుగు చూడలేదు.
సంధి మలుపు తిరగనేలేదు.
పాతను పాతేశామనుకున్నా
కొత్తను సొంతం చేసికోలేకున్నాం.
గోడలకు గోరీలు కట్టామనుకున్నా
సమతాసౌధాన్ని నిర్మించలేకున్నాం
మేధ పెరిగి పోయిందనుకున్నా
మమతను పెంచుకోలేకపోతున్నాం.
తరుణం వచ్చి మీద పడ్డాకూడ
ప్రతిభతో సంగమించనివ్వం
బానిస బ్రతుకువీడి దశాబ్దాలైనా
భోగాలకింకా బానిసలుగానేవున్నాం
సుద్దుల సద్దు అణగి పోనూలేదు.
శ్రమ జీవనం జీవనాడి కానూలేదు.
ఈ వికృత సంధ్యలో—
జాతి ప్రగతి ఎలా సాధ్యం?
మనిషి బ్రతుకులో వెలుగసాధ్యం!

జారిన తెర

జారిన తెర
తొలగుట ఎలా?
చెదరిన కల
కుదురుట ఎలా?
కూర్మి నిండిన ఎడద
వ్యధను ఓర్చుట ఎలా?
రాగరంజిత బంధం
వీడిపోయిన ఎలా?
క్షీరం త్రాగిన ఉరగం
కాటు వేసిన ఎలా?
అభిషేకించని శిల
పూజనీయ మెలా?
పుణ్యమివ్వని గంగోత్రి
పావని యగుట ఎలా?
మనిషిని వెన్నాడే మృత్యువుని
మచ్చిక చేయడం ఎలా?
నీవు సృజించిన నేను
నిన్ను చేరుట ఎలా?
చేరకున్ననూ ఎలా?

అంతరంగాలు

మహాసాగర గర్భం
మణి మాణిక్యాలకు నిలయం
మానవ హృదయాంతరంగం
మహోన్నత భావాలకు రంగం
ఇది పకృతి ప్రసాదించిన
అఖండ సంపద్విలసనం!

కానీ—
సాగర తీరాన్నేలేది
గువ్వల గవ్వల రాజ్యం
ఉదధిని కల్లోలించేది
ఉత్తుంగ తరంగ ధ్వానం
హృదయోపరితలం నేర్చింది
దురహంకార దురభిమానసూక్తం
ఈ బహిరంతర్వేణికలు
ఒకే ఒక్క తరంగిణియై
సమధర్మం పాటిస్తే
సుగుణోన్మీలనం సాధిస్తే
జగమే సుధాధామం
బ్రతుకే సౌఖ్యారామం.

సురవధూటి

నా ప్రమోదార్థం
విలుకాని వినోదార్థం
సమస్త సృష్టి సౌందర్యం
నా ముంగిట్లో నిలిచింది
తన కౌగిట్లో నన్ను దాచింది.

కానీ— ఈ
అస్థిర మధ్యాహ్నం
రుధిరాన్ని కక్కుతోంది
శిథిల శూన్యగగనం
అధరాన్ని తాకుతోంది
నిశ్చల నిర్మల సాగరం

మథనాన్ని కోరుతోంది
ఖేదం వీడిపోదు
మోదం జాడలేదు.

అయితేనేం—
నా స్వాప్నిక సురవధూటి
ఆశల చంద్రశాలలో
తన సుందర వదనంతో
నా ముందు ఒకే ఒక్క క్షణమాగింది
యక్షగానమై మురిపించింది.

అంతలోనే వెన్నెల సోనల కరిగిపోతూ
విఫల ప్రేమ గీతికా చేలాంచలంతో
విమల రమ్య వాసంతికా దరహాసంతో
నన్ను నెనరు మీర నిమిరింది
నా నయనాల్లో వెలుగు నింపింది.

ఈ భావజగతిలో
శాశ్వతంగా నిలచిపోతూ
ఒకే ఒక్క కౌముదీ
శీతల కిరణ రేఖలా నిష్క్రమించింది
జీవన భాగీరథిలో నన్ను
బాధాజీవిగా మిగిల్చింది.

హిపోక్రసీ

కవిరాజేశ్వరులు గతించారు
మినీ కవితలుదయించాయి.

నేటి సగటు కవి
వృక్షంవంటి వాడుకాదు
మన్నులో మిన్నులోనూ కలిసిపోయి
మనల్ని మంత్రముగ్ధుల్ని చేయడానికి—

నేటి సగటు కవిత
సంస్కృతి, కల్పనా, వాస్తవాల సంగమం కాదు
స్వర్ణారుణ రాగాలు చిందించి
మనల్ని జ్ఞాన ప్రపూర్ణుల్ని చేయడానికి.

అందుకే—
ఉత్తమోత్తమ కావ్యసృష్టి
ఉదాత్తంగా ఉన్మీలించాలంటే
సృజన శక్తి పెరగాలి
హిపోక్రసీ తొలగాలి.

వేదనా సుఖం

వేదనా సుఖం
నా ప్రాణం
నీరస గళం
నా ధ్యానం

నా శిథిల నేత్రయుగ్మంలో
ఘనీభవించింది శిలాధర్మం
సుఖస్వప్నాల రాహిత్యంలో
నర్తించింది వైఫల్యాల శైత్యం
మూల్గునీడల సుడిగుండాల్లో
విలీనించాయి మమతల ఆద్యంతాలు
ఈ ఎగుడు దిగుడు బ్రతుకు బాటల్లో
నా నడకంతా ఒ నిట్టూర్పుకాగా
రేపు తెలియని ఈ జాతరకు
మాపుగా, మరోపిలుపుగా
ఆపింతు, సఖీ !
నీకై ఒక రుధిర భాష్పమ్ము విధిగ
మురిసి పోదును, చెలీ!
విహాయసమున వెన్నెలలో నిన్గలసి, సొలసి—

నవజీవన గీతం

దగాపడిన తమ్ముళ్ళూ!
ఎన్నాళ్ళోయీ! ఈ కన్నీళ్ళు!
ఇంకెంతకాలం? ఈ దుర్భర దారిద్ర్యం
ఎప్పుడు తొలగేది! ఈ భయద
వ్యథాభరిత జీవిత గాథాయవనికలు.

పేదరికపు కార్చిచ్చు ప్రీల్చిన
మీ గుండెల లోతుల్లోంచి
మీలోని ప్రత్యణువును ప్రేల్చిన

భయంకర క్షుధార్తి కీలల్లోంచి
మీ ఎర్రని రక్తాన్ని జుర్రుకున్న
దోపిడి గాండ్ర తుదిశ్వాసకు ప్రతీకగా
ఆవిర్భవించింది అభ్యుదయ సిద్ధాంతం.

ఆ సువర్ణ పథగమనంలో
మరుగుపడ్డ మీ మేధాశక్తి
మీకు కరదీపిక కావాలి
అందుకై మీరందరు
అక్షర సాయుధులవ్వాలి
మీ చేతలు చిరమౌనం వీడాలి
మీ చేతన ఈ దోపిడిని తుదముట్టించాలి.

అంతవరకు — తమ్ముళ్ళూ!
నాకీ శవజాగరణ తప్పదు
నేను సజీవ దహనం చేయలేను
మానవత్వంమీద నమ్మకం పోలేదు
తిరోగమనంమీద పోరు మానలేను.

సనాతన ధర్మం బోధించలేదు
అధర్మ నియంతృత్వాన్ని
వేదాలు ఘోషించలేదు

పరపీడన పరాయణత్వాన్ని
పెరవానిలో తనవానిని చూచుకొనే
పారమార్థిక భావాల్ని నేర్చుకోమన్నాయ్ !

నిష్కామ మానవసేవలో
నిజనారాయణున్ని చూడమన్నాయ్
మనిషే మనీషిగా మారడానికి
ధర్మ నిరతిని పాటించమన్నాయ్
పరహితాన్ని పెంచమన్నాయ్
నవమానవుణ్ణి సృజించమన్నాయ్

అందుకే —
నేటి నవ్యసమాజ నిర్మాణానికి
చైతన్యమే రాచబాట
జాతి ప్రగతి సౌధానికి
ప్రజాసుఖమే పెట్టని కోట.

ప్రజాశక్తి జాగృతమైనవేళ
ప్రభుత్వం నిదురించనివేళ
నినదిస్తుంది విశ్వం సమస్తం
సామ్యవాద విజయధ్వానంతో
కోటి గొంతుకల "నవజీవన గీతం" తో —

అదృశ్య హాసం

ప్రభూ ! నీ పద సవ్వడి చొరని
అణువేదీ పృథివీస్థలిలోలేదు.
నీ పదమంజీర రావాల ప్రతిధ్వనిలో
ఈ భువనమంతా నన్ను
సమ్మోహింప చేస్తోంది.

ఎటు వెళ్ళినా
నీ భవ్యరూపదర్శన భాగ్యమే !
ఎటు చూచినా
నీ అదృశ్య రచనా విన్యాసమే !
ఎటు వినినా
నీ దివ్య నామ సంకీర్తన సుధాపానమే !
ఈ విరహ తప్త హృదిని
ఎటులైనా కరుణించి కావుము.

ఈ క్షయ సామ్రాజ్యాన్ని
సృజించిన వినోదప్రియా !
నాపై నీ కృపను కుమ్మరించు
నా పాశవికతను సంహరించు
నా భక్తిహీనతను పరిహరించు
భక్తి భావ జలధిలో
నా భవబంధాలన్నీ నిర్గమించేలా
ఈ విరహార్తి విశ్రమించేలా
నా అణువణువును స్పృశించు
నే కోరు అక్షయాన్ని ప్రసాదించు.
కడవరకు నా కనులందే నివసించు !!

మానస విహంగం

మానస విహంగమా!
ఎంతెంత దూరాలకు
ఈ అనంత ప్రయాణం ?
ఎటూవైపూ మన పయనం ?

ఊహాలు పండే ఊరికా ?
నీరవ నిర్జన వాటికకా ?
పరువాలు వట్టిపోని ప్రణయలోకానికా ?
కాలం కొలవలేని కారుణ్యవనానికా ?

ఇంకెంత కాలంచెప్పు
నీ రెక్కల చప్పుళ్ళు !
ఎంత కాలానికీ దిగిరావేం ఆ
శ్మశానాకాశపు కార్మొయిళ్ళు ?
ఎంత ఓరిమి వహించినా ఆరిపోవేం
ఇనబింబంలోని ఆ పెనుమంటలు ?
ఎంతకాలం వేచినా నవ్వవేం
ఈ బ్రతుకు గోడల చీలికలు ?

అందుకే – అందుకే
అందంగా నవ్వేద్దూ – నువ్వైనా
ఓ చక్కని మరుమల్లియలా
ఒక్క మారంటే, ఒక్కమారే – సుమీ !
నా నడిరేయి మంటల సుడులన్నీ
ఈ నెత్తురుటేరుల్లో సమసిపోయేలా
నా జీవన ఫలం నీకన్నుల్లో మెరిసిపోయేలా !

చీకటి గోళం

ఎవరు నీవు ?
నిన్నెవరని గుర్తించాలి ?
నిన్నెలా గర్హించాలి ?
నీ రూపంటే నాకసహ్యం.

మానవతా మాధురిలో
కాలకూట విషానివా ?
కాల గర్భాన్ని ఛేదిస్తున్న
కఠోర బడబాగ్నివా ?
హరచరణసింగ్ లోంగ్‌వాల్‌ను కూడ కడకు
పరమ నికృష్టంగా
పొట్టన పెట్టుకొన్న కాలసర్పానివా?

స్వార్ధ ప్రలోభావాలకు
అధికార ప్రయోజనాలకు
బలిపశువై కన్నతల్లి కడుపునే
పేల్చివేస్తున్న – నీ వెవరవు?

యుగ యుగాలుగా
అనురాగ సుధల్ని కాలరాస్తూ
అజ్ఞానాంధకారాన్ని కౌగిలిస్తూ
జాతి సమగ్రతనే సవాల్ చేస్తున్న
నీ రాక్షసత్వం ఇకసాగదు
నాజాతి నిన్నింక సహించదు.

ఈ భరతజాతి చరిత్రపుటల్లో
సమతా కాంతులు నింపేందుకు
మా బ్రతుకు బాటల్లో
మమతా సుమాలు విరబూసేందుకు
నిన్నిక తుదముట్టించక తప్పదు
ఇక హింసకు అహింసంటే చెల్లదు.

(20-8-85 న శ్రీ హర్‌చరణ్‌సింగ్ లోంగ్‌వాల్‌ను హత్యగావింపబడ్డ సందర్భంగా ఆయన దివ్యస్మృతికి సమర్పించబడ్డ అక్షరాంజలి)

మధుర పరిహాసం

విశ్వాకృతి చూడచూడ
మానవాత్మ చకితమౌను
విశ్వతేజంలో విలీనించిన
మానవాత్మ ధృతిని పొందు
చంద్రికల చలువ కూర్మిలో
జీవాత్మ పేరిమి పరీమళించు
విధి విహిత అనుగమనంలో
మానవాత్మ పునీతమౌను....
సరస సమ్మోహన జగతి గాంచ
మది కళాసాగరమై పొంగు
శిధిల మానవ బ్రతుకు నీడలు
చరమ గీతాల కుటిల క్రీనీడలు
విశ్వయాత్రికుల ప్రణయ ప్రస్థానం
ఆ విశ్వనేతకు మధుర పరిహాసం.

విషాద రోదసిలో . . .

కాకి కన్ను వోలె
కార్చిచ్చు వోలే
చావుల తీరాల నేలు
గాఢాంధకార పొలిమేరల వోలె
దుర్భర దారిద్ర్యంలో విశ్రమించిన
వికృత శవాల చిర నర్తనల్లో....
అటు అంతటా నిశ్శబ్దం!!!
అదే చరమాంక రంగస్థలం!!

కాని —— ఇటువైపు
అద్భుత ప్రజా సందోహం
అనంత వికృత జన విద్రోహం
అందరిలోనూ ఒకే పరుగు
అందరి పరుగుల్లోనూ
శుష్క గమ్యాలు వేనకువేలు.

ప్రతివాడూ ఏదో సాధించాలనీ
సాధించలేనిది భోదించాలనే
నిష్క్రియా ధూర్త నినాదాలతో
భోదించింది సాధించలేకపోతున్నారు.

ఈ లోకంలో ఒక్క క్షణమైనా
ధర్మ ప్రబోధాన్ని కావించడం
పదుగురి హృదిలో ప్రీతి వెలిగించడం
కరుణా సుధల్ని వర్షించడం
సజల నయనాల నేలు
శీతల వాయువులను
సమూలంగా సమాప్తించడం
సద్ధర్మ ప్రబోధాల ఫలసాయం
అపుడే అందరి కళ్ళల్లో శరత్కాసారం !
ఆ క్షణమే అక్షయ కరుణామూర్తి సాక్షాత్కారం !

కానీ—
సదా ధర్మ పన్నాల్ని వల్లిస్తూ
మానవత్వపు కనీస ధర్మాల్ని
సమూలంగ సమాధిచేస్తున్న
నరాధములతో నిండిన ఈ
ముష్కర సమాజంలో
సద్ధర్మ నిరతికి నిలువ నీడేది ?
సంఘశ్రేయస్సెలా సాధ్యపడేది ?

సాంధ్యవేళ

శశిప్రియా! నీ ధవళ కాంతివనసీమల విహరించి
నా జీరవోయిన గళము శృతి కూర్చ నెంచ
ఎడద రొదలోన యింకె నా వేదనా గాథలన్ని
చిమ్మ చీకటులై కమ్మె నాలోని నీడలన్ని
ఈ సాంధ్యవేళల విందునా నీ మధురగీతి?
నీ తుహిన తారలు తివియునా ఈ హృదయపీఠి ?

శారద శర్వరీ సుధా పానోత్కంఠనై
పరువు పరువున పరువెత్త తలపువున్న
సంజపడతినే కాంచి సర్వమ్ము కోలుపోతి
బధిర లోకాన ఈ యాత్ర ముగియకుంది
రుధిర ధారల వెలయునా ముగ్ధరవళి ?
వ్యథా నౌకలు దాటునా ఈ శోకజలధి ?

మలిన భాష్పాల నొప్పారు ఈ జగతియందు
మంద భాగ్యాల రాశిగా మారిపోక
నీ నుదుటపండిన తళుకులే పట్టినేను
మ్రోడు మ్రాకుల వెలిగించి మురిసిపోదు
ఈ తెరను తొలగించి చూపవా ప్రాభాత ప్రాంగణమ్ము
నీ మరుల పొదరిల్లు చేరునా ఈ మౌక్తికమ్ము !

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక దీపావళి సంచిక, నవంబరు 1985)